రూపంగా ఒక చిన్న మొత్తాన్ని మీరు నిర్ణయించండి. హృదయపూర్వకమైన అభివృద్ధితలుగా నన్ను సంతోషింపచేస్తుంది."

సాంకేతికంగా ఆలోచిస్తే ఎనిమిది సంవత్సరాల ఉద్యోగం శాశ్వతమైన పెన్షనుకు అధికృతి సంపాదించేటంత కాలం కాకపోవచ్చు. కాని సేవామూల్యం కేవలం కాలపరిమితిపైననే ఆధారపడలేదు. స్వీయోన్నతికంటె సంస్థ ఉన్నతి ముఖ్యంగా ఎంచుకొని, ఆచరణద్వారా సహచరులను అనుసరణీయమైన ఋజువర్తన చూపి శ్లాఘనీయావధులను అందుకోవడంలో ఉంది. పత్రికా సంస్థల అభివృద్ధికి బాహ్యకారణాలు కలిగించే అవరోధాలు, దోహదాలు, పరిమితం: సంస్థ వికాసానికి అంతర్యంలో అడ్డం నిలిచేది అందులోని పనివారలు సంస్థ అభివృద్ధికి అనుగుణంగా తమ జీవితాలను సమన్వయించుకోలేకపోవడం. అత్యధిక సంఖ్యాకులలో సంస్థకు మితిమీరిన బరువు కలిగించకూడదనే ఆలోచనే ఉండక సర్వదా వేతనల ప్రలోభాలలోనే మునిగి తేలుతూ ఉంటారు. ఆధునిక భౌతిక ప్రేరేపణల వాతావరణంలో శ్రీ నటేశ అయ్యర్ విలక్షణ వ్యక్తిగా నిలిచి, కార్మికవర్గ వాంఛలపట్ల అపార సహానం ప్రదర్శించి అందరి మన్ననలకు పాత్రుడైనాడు. వస్తుతః ఆయన సాత్విక గుణ సంపన్నుడు: అయినా వ్యవహార జగత్తులోని మెళకువలను కూకటివేళ్లతో సహా ఆకళించుకుని సామర్థ్యంతో సంచరించగల వ్యవహార దక్షుడు.

"స్వతంత్ర"కు నేటివరకూ లభించిన యత్కించిత్ విజయం ఏదైనా ఉంటే అది శ్రీ నటేశ అయ్యర్ రూపొందించినదే. ఆయన అజాతశత్రువు. తన సాన్నిధ్యంలోకి వచ్చిన ప్రతి వ్యక్తినీ ఆయన స్నేహితుడిగా మార్చుకోగలడు. ఏతద్వర్తన ద్వారా ఆయన "స్వతంత్ర"కు సేకరించిపెట్టిన సుహృద్భావాల్ని అంచనా కట్టడం సులభంకాదు. మా యిద్దరిమధ్యా యింత కాలమూ ఛాయామాత్రంగానైనా ఒక్క అభిప్రాయ భేదం రాలేదు. అంతటి శీలవంతుడి సహాయానికి ప్రతిఫలంగా ఏమిచ్చినా "స్వతంత్ర" తన ఋణాన్ని తీర్చుకోలేదు.

---

స్కెచ్

# ఆశయసిద్ధి

## రాపర్ల దివ్యప్రభాకర్

భోజనానికి వేళయినా లేచి హోటలుకు వెళ్లాలనే ఆలోచనలేకుండా ఆలోచనలో పడ్డాడు సుదర్శనం. చిన్నప్పట్నుంచీ ఏవో ఆశయాలంటూ వెర్రెత్తిన ఘటం. అవన్నీ యీ వయస్సులోనేగా నెరవేరేది! తను చదివిన పుస్తకాలన్నీ కళ్ళముందూ, విన్న ఉపన్యాసాలన్నీ చెవులప్రక్క ముసిరి అతన్ని యింకా స్త చీకాకు పరుస్తున్నాయి. వీరల్లో చాలామంది లైసెన్సు లేకపోయినా వెనకడుగువేస్తే, ఇక తనకా? ఈ విశాల జగత్తులో తనూ, తన ఆశయాలూ ఎన్నో వంతు! అని తన కెందుకులే అని తన మనస్సును కన్విన్స్ చేద్దామని చూసినా ఆగదాయె!

కీర్తిశేషులైన సంస్కర్తలూ, మహాత్ములూ సుదర్శనాని కివ్వాళ దర్శనమిచ్చారు. పితృదేవత ఆత్మశాంతికీ, ఆనందానికీ సూచనగా మొన్ననే తను 'తద్దినం' పెట్టివచ్చాడు తండ్రికి. అలాంటి తను యివ్వాళ యీ కీర్తిశేషులందర్నీ ఆదర్శంగా పెట్టుకుని వెలుగుతూ, వాళ్ళను ఎలా కాదనగలడు?

వినయంతో భయభక్తులతో చేతులు కట్టుకుని, తల వంచుకున్నవాడై "ఏమి సెలవు" అన్నాడు సుదర్శనం. సంస్కర్తలు అతని విధేయతను హర్షించి, చిరునవ్వుతో ఒండొరుల ముఖాలు చూసుకుని, సుదర్శనం చూపిన ఆస్థానాల్లో ఉపవిష్టులయి, సాభిప్రాయంగా అతని ముఖంలోకి చూశారు.

చిన్నప్పుడు సుదర్శనం చెయ్యిచూసి ఒక జ్యోతిష్కుడు "ఆర్థిక పరిస్థితులు ఎలావున్నా మానవుల్లో చాలామందికి సుసాధ్యం కాని ఓ ప్రత్యేకత నీలో ఉంది. అదే ఎదుటివాడి ముఖంచూసి మనస్సులో భావాల్ని పసికట్టటం" అని చెప్పి, దమ్మిడీ పుచ్చుకోకుండా తన దారిన పోయాడు. అలాంటి నిస్వార్థమూర్తిని సుదర్శనం నమ్మకుండా వుండలేకపోయాడు. ఆ భావం తోనే ఇప్పుడు కీర్తిశేషులు తనను ఏం కావాలనే కోరికలో తనవంక సాభిప్రాయంగా చూశారో పసిగట్టి సుదర్శనం గుమ్మందాకా వెళ్ళి "సూరి! నాలుగు కాఫీ పట్రా!" అన్నాడు.

మళ్ళీ వాళ్ళను సమీపించి చేతులు కట్టుకుని నిలబడ్డాడు. "అయితే ఇప్పుడు నీ అభిప్రాయం ఏమిటి?"అన్నాడు వాళ్ళల్లో ఒక బొద్దుమీసాల ముసలాయన. "మీ ఆజ్ఞ" అన్నాడు వెంటనే సుదర్శనం సంకోచించకుండా. అయినా లోపల కాస్త బెరుగ్గానే వుంది వాళ్ళు తనకు ప్రతికూలంగా ఆజ్ఞ ఇస్తారేమోనని.

"ముందు నీ ఉద్దేశ్యం చెప్పు అదే న్యాయం. ఇతరులమీద గుడ్డిగా ఆధారపడకూడదు. మానవుడైన తరువాత కొంత స్వాతంత్ర్యం ఉండాలి. నీదారి తప్పైతే ఇతరులే సలహా చెపుతారుగా!" అన్నాడు కర్రపుచ్చుకున్న కళ్ళజోడు ముసలాయన.

"అలాక్కాదు. ఒకడు చెప్పడం, అంతా చెయ్యటం అనేది క్రమశిక్షణ. అది లేందే పనులు సాగవు" అని గంభీరంగా చూస్తూ అన్నాడు లాంగ్‌కోటు తొడుక్కున్న ఒడ్డూ, పొడుగూ మనిషి.

అన్నీ సబబుగానే తోచినాయి సుదర్శనానికి. సూరి కాఫీ తెచ్చాడు. ముసలాయన "నాకు కాఫీ అలవాటు లే"దన్నాడు. మిగిలిన యిద్దరూ నాలుగు కాఫీ గుటకా యిస్వాహా చేశారు.

"చేసుకుందామనే. కాని నాకంటే ఎక్కువ చదువుకుంది. నన్ను విశ్వసించి సంసారం సాఫీగా చేస్తుందా అనే ఆలోచన"అన్నాడు మెల్లిగా.

లాంగ్‌కోటాయన వెంటనే అందుకుని "ఆ సందేహం ఎప్పుడూ పనికిరాదు. మానసిక వికాసం, విశ్వాసం, ప్రేమా, ఆరాధనా- ఇవ్వే ముఖ్యం! చదువు, వయస్సూ వివాహంలో ముఖ్యపాత్రలు వహించవు"అన్నాడు.

"అదెలా?... దేశాచారాన్ని విస్మరించి... నేనొప్పను..." కళ్ళజోడు ముసలాయన.

"నామటుక్కు నాకు అభ్యంతరం లేదు." అన్నాడు బొద్దుమీసాలాయన.

"చిత్తం మీ యిష్టం!"అన్నాడు సుదర్శనం. అసలు ఇంతకీ తను ఇందరి పుస్తకాలూ చదవకుండా ఏవొక్కరినో అనుసరిస్తే బాగుండేది అని లోపల నొచ్చుకున్నాడు.

"నా ఉద్దేశ్యం చేసుకోమని..."

"నా ఉద్దేశ్యం ఒద్దని..."

"నా ఉద్దేశ్యం నీ ఉద్దేశ్యమే..."

"ఆలోచించు"అంటూ అంతా అంతర్థానమయ్యారు.

సుదర్శనానికి చెమటలుపట్టి, చొక్కా తడిసి, టేబిలుమీదున్న పుస్తకంతో విసురుకుంటూ కుర్చీలో కూలబడ్డాడు. అలాగే నిద్రపట్టింది.

* * *

కీర్తిశేషులుకనిపించి నెలకావచ్చింది. ఇంతకాలం సుదర్శనం ఆలోచిస్తూ, విషయాన్ని తర్జనభర్జన చేస్తూనేవున్నాడు. తనలో యీ మానసిక ఆందోళన ప్రముఖపాత్ర వహించినప్పట్నించీ సుదర్శనం మళ్ళీ కీర్తిశేషులు ఎక్కడ కనబడి తనని బెదరగొడతారోనని రాత్రిళ్లు ఎక్కువగా సినీమాలకు వెళ్ళటం, నలుగురయిదుగురు మిత్రుల్ని తోడుగా రూముకితెచ్చుకోడం ప్రారంభించాడు.

...చివరికి ఆమెతో చెప్పేశాడు తనకేమీ అభ్యంతరం లేదని. మళ్లీ నెలతిరిగేసరికి సుదర్శనం బ్రహ్మచర్యానికీ, హోటలు మీల్సుకీ స్వస్తి.

ఒడుదుడుకుల్లేకుండా సంసారం సాఫీగానే సాగిపోతోంది. ఆమె ఎప్పుడూ నిర్లిప్తంగా ఉండేది. బడికి వెళ్ళటం, బడి ఒదలగానే ఇంటికొచ్చి కథలువ్రాసుకోడం ఆమె పని. పంతులమ్మ భర్త అని సుదర్శనాన్ని ఎవ్వరూ నిరశించలేదు. ప్రపంచం యథాప్రకారంగా నడుస్తూనేవుంది.

సుదర్శనం తన ఆఫీసుపని కాగానే పుస్తకాలూ, ఆమె కథలూ చదువుతూ కాలంగడిపేవాడు. ఆమె వ్రాసిన ప్రతీవాక్యం అతనికి చాలా భావపూరితంగానూ, అనుభవపూరితం

గానూ గోచరించేది. ఆమె రచనలు అప్పుడప్పుడూ పత్రికల్లో పడుతూండేది. సుదర్శనం "ఓహో! ఏం భావం, ఏం రచనా!" అని పొగిడేవాడు.

"నాకు నిర్ణీతభావాలేమీ లేవు" అని ఆమె తెగేసి చెప్పేసింది. సుదర్శనం ఆశ్చర్యపోయాడు.

ఒకమాటు ఒక పత్రికలో పడ్డ కథ చదివి సుదర్శనం ఉప్పొంగిపోయాడు. "ఏంభావాలులేవని నువ్వబద్ధం ఆడుతున్నావ్. ఈ కథలో ఏ కొద్ది మందికో కానీ, అర్థంకానిభావాలు అనంతంగా యిమిడివున్నాయి. చూడు, కథానాయిక చేసిన పని లోకం హర్షించకపోయినా మహత్తరమైంది. పాపం! స్త్రీ ఎంత కాలం ఆ దుస్సహతాపాన్ని భరించగలదు!" అన్నాడు సుదర్శనం.

"మీరామెను నిజంగా హర్షిస్తున్నారా? సాంప్రదాయ విరుద్ధంగా ప్రవర్తించినందుకు అందరూ ఆమెని దుయ్యబట్టటం లేదూ?" అందామె సుదర్శనాన్ని నిశితంగా అవలోకిస్తూ.

సుదర్శనం ఇంకాస్త ఉత్సాహపడి "లేదు, లేదు... నేను హృదయపూర్వకంగా హర్షిస్తున్నాను. ఆమె ఒక్కతే కాదు. దేశంలో ఏ స్త్రీ అయినా అలాంటి దుర్గతిలో పడితే సాహసించాల్సిందే!" అన్నాడు.

ఆమె తలపంకించి, నేలవంకచూచి ఏదో ఆలోచిస్తూ మెల్లిగా అంది "మానవులంతా హృదయపూర్వకంగా, విశాలత్వంతో మాట్లాడగలరని నాకు విశ్వాసంలేదు."

సుదర్శనం ఆ మాటకి నొచ్చుకున్నాడు. కాని ఆ భావాన్ని ముఖంలో కనిపించకుండా దాచుకుని "అవును, నిజం... కాని నేనుమాత్రం ఇప్పుడు చెప్పింది సత్యం" అన్నాడు.

"కథానాయికి సాహసించిందంటే సకారణంగానే వుంది. కొందరు స్త్రీలు ఇంకా చాలా స్వల్పవిషయాలకే భర్తలంటే ఏవగింపూ, ఏహ్యతాకలిగి విడిచిపెట్టేస్తున్నారు. అది సబబయింది కాదేమో!" అంది అనుమానంగా భర్తవంక చూస్తూ.

సుదర్శనం వెంటనే అందుకున్నాడు "నా ఆశయాలూ, భావాలూ నీకు తెల్సు. నా భావం ప్రకారం నేను స్థిరీకరించుకున్నదేమంటే స్త్రీ తనకయిష్టం కలిగిన తరవాత యిక ఆ భర్తతోనే సంసారంచేయటం దుర్భరం, కాబట్టి విడిచి పెట్టెయ్యటమే కర్తవ్యం. నీ కథానాయిక భర్త తృతీయాకృతివాడు కావటం వల్లనే విసర్జించింది. అంతేకాకుండా తనప్రియుణ్ణి కలుసుకుంది. కాని అతను కొంతకాలం మాత్రమే ఆమెకి దక్కాడు. హృదయాన్ని నైర్మల్యభరితం చేసుకుని సంస్కారభావాలుగలవ్యక్తిని వివాహమాడింది..ఇది చాలా మెచ్చుకోదగ్గవిషయం!" సుదర్శనం యిలా అని పూర్తిచేసి మనస్సులో ఎందుకో బాధపడ్డం ప్రారంభించాడు.

"ఆ వ్యక్తే మీ భార్య అయితే మీరేం చేస్తారు?" అతని ముఖంలోకీ అంతరాళాల్లోకీ ప్రవేశించి చూస్తున్నట్లు అంది ఆమె.

సుదర్శనం ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. తన సతి కులట అనీ, కొందరువ్యక్తుల్ని ఆరాధించి తనకి దక్కిందనీ ఊహించలేకపోయాడు. ప్రపంచం తలక్రిందౌతూన్నట్లూ, భూగోళం వందరెట్లు వేగంగా తిరుగుతూన్నట్లూ, కాళరాత్రి దాపించినట్లూ ఊగిపోయాడు.

"నిజం???" పూడిపోయిన గొంతులోంచి ఈలవేసినట్లు వచ్చింది ఆ మాట.

"నిజమే!" నిబ్బరంగానే అందామె.

